కథ

జె. సునీల్

# మనసా! నీకిది తగునా?

స్వప్న నుండి ఫోన్ రావటంతోనే మహేంద్ర కాస్త ఇబ్బందిగా ఫీలయ్యాడు. ఆమెకు ఏం జవాబివ్వాలో అర్థం కాలేదు. 'రాజేష్ ఈరోజు కూడా ఆఫీసుకి రాలేదు. అసలీ ఆఫీసులో ఉద్యోగం మానేయబోతున్నాడన్న మాట కూడా వినిపిస్తోంది. మరి.. ఈ విషయం స్వప్నకు ఎలా చెప్పాలి?!..'



ఆలోచనల మధ్యనే అతడు కాల్ రిసీవ్ చేసుకున్నాడు. ''హాయ్ స్వప్నా''

స్వప్న డైరెక్ట్‌గా విషయంలోకొచ్చేసింది. ''రాజేష్ ఆఫీసుకొచ్చాడా?'' తనలా అడగడంలోనే ఎంత టెన్షన్ ఫీలవుతుందో అర్థమవుతోంది.

''రా.. రాలేదు స్వప్నా''

''రాలేదా?'' ఆమె గొంతులో ఒక్కసారిగా నీరసం ధ్వనించింది.

''రాలేదు.. ఐనా అతడు ఆఫీసుకి వస్తే, నేనే రింగ్ చేసి చెప్పేవాడిని కదా?'' తనూ ఆ విషయం మరచిపోలేదన్నది మరోసారి గుర్తుచేసాడు.

''నిజమేననుకో. కాని.. టెన్షన్ పడుతున్నాను. అందుకే నిన్ను ఇబ్బంది పెడుతూ ఎక్కువసార్లు ఫోన్ చేస్తున్నాను'' ఆమె అపాలజిటిక్‌గా పలికింది.

ఆమె అలా అనేసరికి అతడూ కొద్దిగా బాధపడ్డాడు. ''నోనో! ఇందులో నేను ఇబ్బంది పడేదేముంది? నువ్వలా ఫీల్‌కావద్దు''

''థాంక్యూ.. వుంటాను'' స్వప్న ఫోన్ కట్ చేసింది.

మహేంద్ర సెల్ పక్కన పెడుతూ, ఛెయిర్‌లో వెనక్కు వాలాడు. 'రాజేష్.. రాజేష్ ఇలా ఎందుకు చేస్తున్నాడు? అతడేగా స్వప్నతో పరిచయం చేసుకుంది. ఆమెను మెల్లగా ప్రేమలోకి దించిందీ తనే!.. ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే అతడు, ఆమెను దూరం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టుంది. కాని.. కాని అతడిలా మారడానికి కారణమేమిటి? ఒకవేళ ఏ విషయంలోనైనా వారిద్దరికీ మనస్పర్థలు వచ్చాయా?..'

అతడికిక వర్క్ మీద కాన్సన్‌ట్రేషన్ కుదర్లేదు. సీట్లోంచి లేచి క్యాంటిన్ వైపు నడిచాడు.

ఆ సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికెళ్ళలేదు. స్వప్నకు ఫోన్ చేసి పార్క్‌కి రమ్మన్నాడు.

ఇద్దరూ పార్క్‌లో కలుసుకున్నారు.

''స్వప్నా! అసలేం జరిగింది?''

ఆమె అతడి ముఖంలోకి అయోమయంగా చూసింది. ''ఏదో జరగటమేమిటి?''

ప్రశ్నకు ప్రశ్న జవాబు కావడంతో అతడే తడబడవలసి వచ్చింది. ''అంటే.. అంటే నా ఉద్దేశ్యం.. నువ్వూ రాజేష్ ఏదైనా విషయంలో గొడవపడ్డారేమోనని..''

''అలాంటిదేమీ లేదు'' ఆమె సిన్సియర్‌గానే చెప్పింది.

''అది గొడవలా నీకనిపించకపోవచ్చు. కాని అతడు హర్ట్ అయ్యాడేమో! అలాంటి సందర్భాలేమైనా వున్నాయేమో,గుర్తుకు తెచ్చుకో''

స్వప్న కొద్ది క్షణాలు ఆలోచించింది. ఆ తర్వాత తల అడ్డంగా ఆడించింది. ''అసలు మేమిద్దరం గొడవపడడమేమిటి? ఊహూఁ!.. అసలలా ఎప్పుడూ జరగలేదు''

మహేంద్ర దీర్ఘంగా నిశ్వసించాడు. స్వప్న తనకు చిన్ననాటి స్నేహితురాలు. తామిద్దరూ కాలేజీ వరకూ కలిసే చదువుకున్నారు. తనకు స్టాఫ్

వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చాక, అక్కడ పరిచయమైన రాజేష్‌ని, తనే స్వప్నకు పరిచయం చేసాడు. ఆ తర్వాత వారిద్దరూ బాగా కలిసిపోయారు. ఒక రోజు రాజేష్ తనతో చెప్పిన మాటలు విని షాక్ తిన్నాడు. ''మహీ!.. నేనూ, స్వప్న ప్రేమించుకుంటున్నాం...'' ఆ షాక్ నుండి తేరుకోవడానికి తనకు చాలాసేపు పట్టింది. అతికష్టం మీద గొంతు పెగల్చుకుని అడిగాడు. ''స్వప్న.. ని..న్ను.. ప్రే..మి.. స్తోం..దా?'' అతడు పెద్దగా నవ్వాడు. ''నేను ఆమెను ప్రేమిస్తున్నానని చెప్పలేదు. ప్రేమించుకుంటున్నాం అని చెప్పాను. ఆమె ప్రేమించనప్పుడు అలా ఎలా అనగలను?..'' తను స్వప్నను కలిసాడు. ఆమె కూడా ఆ విషయాన్ని కన్ఫర్మ్ చేసింది.. అలా గత ఆరునెలలుగా ప్రేమించుకుంటున్న వీళ్ళు... మరి రాజేష్ హఠాత్‌గా డ్రాప్ కావడమేమిటి?..

స్వప్న, రాజేష్‌తో గొడవ పడలేదని అతడికి అర్థమైపోయింది. అందుకే ''సరే! నేనే రాజేష్‌ని ఎలాగోలా కలుస్తాను.. నువ్వీ విషయంలో బెంగపడకు..ఇంటికెళ్ళు'' అన్నాడు.

అతడలా అన్నప్పటికీ ఆమె ముఖంలో ఆందోళన, భయాలు అలాగే ఉన్నాయి. ఎలాగోలా త్వరగా రాజేష్‌ని కలిసి విషయం తెలుసుకో.. ప్లీజ్..'' అనేసి ఆమె వెళ్ళిపోయింది.

మహేంద్ర మరికాసేపు పార్క్‌లో గడిపాక బయటకు నడిచాడు.

★ ★ ★

అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్‌ని కలిసి, అప్లికేషన్ తీయించి అడ్రస్ నోట్ చేసుకున్నాడు మహేంద్ర. రాజేష్ బెంగుళూరు అడ్రస్ దొరికింది.

అతడు వెంటనే ఈ విషయం స్వప్నకు ఫోన్ చేసి చెపితే ''నేనూ నీతో పాటు బెంగుళూరుకు రానా?'' అంది.

''వద్దొద్దు.. ఈ సాయంత్రమే నేను బెంగళూరు బయల్దేరుతాను''

''రాజేష్‌ని కలిసాక నాతో ఫోన్‌లో మాట్లాడించవూ?''

''అలాగే''

ఆ సాయంత్రం హైదరాబాద్‌లో బెంగళూరు బస్సెక్కాడు మహేంద్ర.

రాజేష్ బెంగుళూరులోనే వున్నాడా? మరెక్కడికైనా వెళ్ళిపోయి ఉద్యోగంలో జాయినైపోయాడా?.. తనకు తెలిసినంతలో రాజేష్ చెడ్డవాడు కాదు. చెడ్డవాడే అయివుంటే ప్రేమ పేరుతో మరోలా వంచించి వుండేవాడు. పొరపాటేదీ జరగకముందే, పక్కకు తప్పుకునేవాడు కాదు... 'ఆ' విషయంలో వారిద్దరి మీదా తనకా నమ్మకముంది. కాని ఇలా చేయడమూ న్యాయం కాదు. ప్రేమలోకి దించి పారిపోవడం న్యాయమెలా అవుతుంది?!.. రాజేష్‌ని నిలదీసి అడగాలి. 'నా ఫ్రెండ్‌కి ద్రోహం చేస్తావా?' అని కడిగేయాలి.. ఏదేమైనా వారిద్దర్నీ కలపాలి..'

బెంగుళూరులో రాజేష్ ఇల్లు కనుక్కోవడం పెద్ద కష్టమేం కాలేదు. గేటు తీసుకుని లోపలికి ఎంటరవుతుంటే అతడే ఎదురుపడ్డాడు. కాని తనను చూడగానే మొదట కాస్త కంగారుపడ్డాడు. ఆ తర్వాత సర్దుకుని ''హాయ్ మహీ! వాటే సర్‌ప్రైజ్.. రా..రా.. లోపలికెళ్దాం..'' అంటూ చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళాడు.

హాలులోనే వున్న తల్లిదండ్రులకు పరిచయం చేసాక, అతడి రూమ్‌లోకి తీసుకెళ్ళాడు.

''నువ్విలా వస్తావని అనుకోలేదు''

మహేంద్ర కూడా నవ్వుతూ ''నేను వచ్చేలా చేసింది నువ్వే'' అన్నాడు.

అతడు తడబడి ''ఓకే.. ఓకే.. ముందు స్నానం చేసి రిలాక్సవ్వు. అలా బయటకెళ్ళి మాట్లాడుకుందాం'' పలికాడు.

మహేంద్రకు రిలాక్సవ్వాలని లేదు. 'మనస్ఫూర్తిగా ప్రేమించుకున్న ఇద్దరిలో ఒకరు హఠాత్‌గా అకారణంగా దూరం కావడానికి కారణమేమిటో తెలుసుకోవాలని వుంది' కాని తన ఆత్రుతను మనసులోనే దాచుకుని, బాత్‌రూమ్ వైపు నడిచాడు.

స్నానం చేసాక, టిఫిన్ తినే కార్యక్రమాలు పూర్తయ్యాయి.

''ఇక వెళ్దామా?'' అడిగాడు మహేంద్ర.

అతడి ఆత్రుతను అర్థం చేసుకున్నట్టు ''సరే పదా'' అంటూ బయటకు బయలుదేరదీసాడు రాజేష్.

ఇద్దరూ ఓ పార్క్‌లో కూర్చున్నాక మహేంద్ర అడిగాడు. ''ఇప్పుడు చెప్పు! నా ఫ్రెండ్ స్వప్నను నువ్వే ప్రేమించావ్. మీరిద్దరూ పెళ్ళి చేసుకుంటారని అందరూ అనుకుంటున్న సమయంలో, ఆమెను మోసం చేసి, హఠాత్‌గా చెప్పకుండానే దూరంగా వచ్చేసావ్''

రాజేష్ ఎమోషనల్‌గా మాట్లాడలేదు. చాలా కూల్‌గానే ''నేను స్వప్నను మోసం చేయలేదు'' అన్నాడు.

''మోసం చేయడమంటే నీ ఉద్దేశ్యం ఏమిటి?''

''చేయకూడని తప్పు చేసి తప్పుకోవడం''

''మరి ఇది తప్పు కాదా?'' మహేంద్ర గొంతు హెచ్చింది.



## ధోనీ అంటే ఇష్టం

**గ్లామరస్ స్టార్ ఛార్మికి తీరని కోరికేదైనా వుందా? ప్రత్యేకంగా ఎవరితో కలిసి నటించాలని వుంది అని అడిగితే ఆమె ఇచ్చే జవాబేంటో తెలుసా? ధోనీతో కలిసి నటించాలని వుందిట. క్రికెటర్ 'ధనా ధన్ ధోనీ అంటే ఛార్మికి తెగ అభిమానమట. ధోనీ స్టయిల్‌ని ఎంతగానో మెచ్చే ఛార్మి అవకాశం వస్తే అతనితో కలిసి నటించాలని అనుకుంటోందిట. మరి ఆమె ఆశ తీరేదెప్పుడో?**

''ప్రేమించడం తప్పు కాదు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడమూ తప్పు కాదు. అర్థం చేసుకున్నాక, మనసుకి నచ్చక తప్పుకోవడమూ తప్పు కాదు'' అతడెంత కాన్ఫిడెంట్‌గా చెపుతున్నాడంటే, తన మనసు చెప్పే మాటల్ని బలంగా విశ్వసిస్తే తప్ప, అలా మాట్లాడలేడు.

ఆ మాటలకి మహేంద్రనే కొద్దిగా కంగుతిన్నాడు. రాజేష్ తప్పు చేయలేదేమోనన్న అనుమానమూ కలిగింది. అంతలోనే తనను తాను సర్దుకున్నాడు. ''ప్రేమించిన అమ్మాయిని వదిలేసి రావడం తప్పు కాక మరేమిటి?... కాని అతడు ప్రేమించి, అర్థం చేసుకున్నాక, నచ్చలేదని చెపుతున్నాడే! అదీ నిజమేగా!.. నచ్చని అమ్మాయిని ఎవరైనా ఎలా పెళ్ళి చేసుకోగలరు?''

ఐతే వారి ప్రేమకు సంబంధించి తనకే తెలియని కొత్తకోణం ఆవిష్కృతమవబోతుందన్న ఒక భావం మనసులో కలిగింది. ఆ కొత్తకోణం వారి ప్రేమకు మాత్రమే పరిమితమా? లేక దానికి నేటి సరికొత్త సహజ నూతన పోకడనే ఆధారమా- అన్నది తేలవలసి వుంది.

మహేంద్రలోని ఆవేశం ఒక్కసారే తగ్గిపోగా, మాటలు సర్దుకుంటూ అడిగాడు. ''ఆరునెలలు కలిసి తిరిగాక, స్వప్న నచ్చకోపోవడానికి కారణం?''

## రజనీ స్టయిల్!

**ఇటీవల కాలంలో భారత దేశమంతటా సంచలనం సృష్టించిన చిత్రంగా నిలిచిన రజనీకాంత్ 'శివాజీ' మరో కొత్త ఆకర్షణను సొంతం చేసుకుంటోంది. శివాజీ చిత్రం ఆరంభం, నిర్మాణం సందర్భంగా జరిగిన విశేషాలు.. వగైరాలతో 'ది మేకింగ్ ఆఫ్ శివాజీ' అనే ఓ పుస్తకాన్ని ఇప్పుడు విడుదల చేసారు. రజనీకాంత్ స్వయంగా ఆవిష్కరించిన ఈ పుస్తకాన్ని త్వరలోనే హిందీ, తెలుగు తదితర భాషల్లోకి కూడా అనువాదం చేస్తారట.**

జవాబు చెప్పటం ఇష్టంలేనట్టు రాజేష్ తల తిప్పుకుని మరెటో చూడసాగాడు.

ఆ ప్రశ్నకు జవాబు వచ్చేస్తే, ఈ సమస్యకు అసలు కారణం అర్థమైపోతుంది. కాని రాజేష్‌కి జవాబు చెప్పడం ఇష్టం లేనట్టుంది.. తప్పదు! బలవంతపెట్టయినా జవాబు రాబట్టాలి.

''చెప్పు రాజేష్! ఆరునెలలు కలిసి తిరిగాక, స్వప్న నచ్చకపోవడానికి కారణం?''

జవాబు చెప్పక తప్పదనుకున్నట్టున్నాడు. అందుకే కాబోలు బలంగా ఊపిరి తీసుకున్నాడు.

''చెప్పు.. ఆరునెలలు కలిసి తిరిగాక...''

''పదహారేళ్ళు కలిసి తిరిగాక కూడా స్వప్న నీకెందుకు నచ్చలేదు? మహేంద్రా?!''

తన మాటలు మధ్యలోనే కట్‌చేసి, అతడు అడిగిన ప్రశ్న తనను అయోమయంలో పడేసింది. అందుకే అసలా ప్రశ్నే అర్థం కానట్టుగా అతడి ముఖంలోకి చూసాడు.

''ఇప్పుడు నువ్వు చెప్పు మహేంద్రా! పదహారేళ్ళు కలిసి తిరిగాక కూడా స్వప్న నీకెందుకు నచ్చలేదు?!.. టెల్ మీ ద ఆన్సర్...''

''స్వప్న... స్వప్న నాకు నచ్చడమేమిటి? మేమిద్దరం మంచి స్నేహితులం..''

''నేనూ అదే అంటున్నాను. మీరిద్దరూ స్కూల్ లైఫ్ నుంచి క్లోజ్ ఫ్రెండ్స్. అంత మంచి స్నేహంలోనూ నీకు స్వప్న మీద ప్రేమ కలగలేదు. స్నేహం వేరు, ప్రేమ వేరు అనుకుంటే స్వప్న మంచి స్నేహితురాలే తప్ప, మంచి ప్రేయసి కాదేమోనని నాకు అనుమానం కలిగింది''

''అసలు నువ్వేం మాట్లాడుతున్నావో నీకర్థమవుతుందా!''

''అర్థం చేసుకున్నాను కాబట్టే ఇంత క్లియర్‌గా చెపుతున్నాను.. నీ ద్వారా నాకు స్వప్న పరిచయమయ్యింది. మేమిద్దరం ఆరునెలలు కలిసి తిరిగాం. ఆ తర్వాతే నాకు అనుమానం వచ్చింది. పదహారేళ్ళు పరిచయమున్న మహేంద్ర, స్వప్నతో ప్రేమలో ఎందుకు పడలేదు?!.. స్వప్నకేమి తక్కువ? మంచి అందం, పెద్ద ఆస్తి వున్నాయి. కాని స్వప్నను పూర్తిగా అర్థం చేసుకున్న మహేంద్ర ఆమెను ప్రేమించలేదు.. అంటే గొప్ప క్వాలిటీస్ ఏవీ ఆమెలో లేవు. పైగా నాకు తెలియని లోపాలు ఆమెలో వుండవచ్చు. అందుకే మహేంద్ర ఆమెను ప్రేమించటం లేదు. నేనే అమాయకంగా ఆమె ప్రేమలో పడ్డాను... ఆ విషయం అర్థమయ్యాకే...''

''స్టూపిడ్'' పెద్దగా అరిచాడు మహేంద్ర. అతడి అరుపునకు అటుగా వెళ్తున్న ఒకరిద్దరు తల తిప్పి వారిద్దరికేసి చూసారు.

అతడు సర్దుకున్నాడు. అప్పుడనిపించింది. 'ప్రేమించడానికి కారణాలు అక్కర్లేదు. అలాగే అనుమానించడానికీ ఆధారాలవసరంలేదు'

మహేంద్ర పెదవులు బిగపట్టి కొద్ది క్షణాలు అలాగే వుండిపోయాడు. 'అనుమానించే ప్రేమ పెళ్ళిగా మారినా, ఆ అనుబంధం సాఫీగా సాగదు'. అందుకే అతడు మరేం మాట్లాడకుండా వెను తిరిగాడు.

అతడలా మౌనంగా కదలడం చూసి రాజేష్ పిలిచాడు. ''మహీ...''

అతడు మాత్రం అక్కడిక ఆగలేదు. బస్టాండు వైపు సాగాడు. హైదరాబాద్ వెళ్ళే బస్సెక్కి కూర్చున్నాక మనసులో అనుకున్నాడు. 'రాజేష్! నేను స్వప్నను ప్రేమించలేదని ఎందుకు డిసైడ్ అయ్యావో తెలియదు. ఆమెను ప్రేమలో దించావ్. స్వప్న నిన్ను ప్రేమిస్తోందని తెలిసినా ప్రేమను మనసులోనే దాచేసుకున్నాను. ఇప్పుడైనా ఆ విషయం నీకు చెప్పొచ్చు. కాని దానివలన నీ అనుమానం తీరదని తెలిసీ, నా ప్రేమను నీ ముందు కూడా వ్యక్తం చేయలేకపోతున్నాను..'

ఒక అనుమానం ప్రేమికుల్ని దూరం చేసింది.

మరో అనుమానం నిజమైన ప్రేమను వ్యక్తం చేయకుండా ఆపింది.

మనసు చేసే విచిత్రమిదే!

☆

